

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

ప్రజాశక్తి - అమలాపురం

తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఈ నెల 27వ తేదీ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ వెల్లడించారు. అర్జీదారులు తమ సమస్యలను టోల్ ఫ్రీ నంబర్ 1100 లేదా మీ కోసమే వెబ్‌సైట్ ద్వారా అర్జీలు సమర్పించవచ్చునన్నారు. అర్జీదారులు తమ ఫిర్యాదులు లేదా అభ్యర్థనలు సమర్పించేందుకు జిల్లా కేంద్రానికి స్వయంగా రావాల్సిన అవసరం లేదన్నారు. దీనికి బదులుగా టోల్‌ఫ్రీ నంబర్ 1100కు కాల్ చేయ వచ్చుని లేదా మీ కోసమే వెబ్ సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో అర్జీలు నమోదు చేసుకోవచ్చుని తెలిపారు. సమస్యలు నమోదు చేసిన తర్వాత సంబంధిత శాఖా ధికారులు వాటిని క్షేత్రస్థాయిలో విచారించి తగిన పరిష్కార చర్యలు తీసుకుంటారని, అర్జీదారుల సమస్యలను వేగంగా పరిష్కరించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు.

ముంచుకొస్తున్న మొంథా

- కాకినాడ-తుని మధ్య తీరం దాటే అవకాశం
- మూడు రోజులు రెడ్ అలర్ట్
- కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు
- అన్నదాతల గుండెల్లో గుబులు

ప్రజాశక్తి- యంత్రాంగం

అన్నదాతల గుండెల్లో మొంథా తుపాను హెచ్చరికలు గుబులు రేపుతున్నాయి. పంట చేతికందే సమయంలో ఏటా తుపానులు దాడి చేస్తున్నాయి. ఈ ఏడాదీ ఆ కలవరం తప్పడం లేదు. ఇప్పటికే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వరి కోతలు ప్రారంభం అయ్యాయి. తుపాను ప్రభావంతో రేపటి నుంచి రాష్ట్రంలో భారీ నుంచి అతిభారీ వర్షాలతో పాటు ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అధికారులను అప్రమత్తం చేసింది. పంట చేతికి అందే సమయంలో ఈదురుగాలులు వీస్తే భారీగా నష్టం జరిగే అవకాశం ఉంది. రూ.వేలల్లో పెట్టుబడి పెట్టి.. ఆరుగాలం శ్రమించే అన్నదాతలు నోటి వద్దకు కూడు వచ్చే సమయంలో తుపాను హెచ్చరికలతో నిద్రకు దూరమవుతున్నారు. మొంథా ప్రభావంతో భారీగా వర్షాలు పడే అవకాశం ఉండటంతో ఇప్పటికే కోసిన ధాన్యాన్ని భద్రపరుచుకోవాలని అధికారులు రైతులకు సూచిస్తున్నారు. వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా కాపాడుకునేందుకు తహసీల్దార్ కార్యాలయాల్లో టార్పాలిన్లు ఉచితంగా అందించేందుకు సిద్ధంగా ఉంచాలని కోరుతున్నారు. తుపానుపై రైతులను అప్రమత్తం చేయాలని రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులకు ప్రభుత్వం సూచించింది. తీర ప్రాంతాల్లోనూ ప్రజలను అప్రమత్తం చేయనున్నారు. తుపానుకు ఎటువంటి ప్రాణ, ఆస్తినష్టం సంభవించకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా అధికారులకు సిఎం చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు. కాకినాడ పోర్టు-తుని మధ్య మంగళవారం అర్ధరాత్రి తీరం దాటే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు సోమ, మంగళ, బుధవారం మూడు రోజులపాటు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించింది. అత్యవసరమైతే తప్పించి ప్రజలు ప్రయాణాలు మానుకోవాలని హెచ్చరించింది. తుపాను కాకినాడ పోర్టు-తుని సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని అంచనా వేస్తుండడంతో కాకినాడ యాంకరేజ్, డీప్ వాటర్ పోర్టులు అప్రమత్తమయ్యాయి. సోమవారం నుంచి మూడు రోజులు అన్ని కార్గో ఎగుమతి, దిగుమతులు నిలిపివేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం డీప్‌వాటర్ పోర్టులో 19, యాంకరేజ్ పోర్టులో ఆరు నౌకలు కార్గో కోసం లంగరు వేశాయి. వీటిని సోమవారం మధ్యాహ్నం తీరం నుంచి 150 నాటికల్ మైళ్ల దూరానికి తరలించనున్నారు. పోర్టులో సోమవారం నుంచి ఐదో నెంబరు ప్రమాద హెచ్చరిక ఎగురవేయనున్నారు. గడచిన ఏడేళ్లలో ఇదే తొలిసారి అని అధికారులు వివరించారు. మరోవైపు కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాల్లో కలెక్టరేట్లు, ఆర్‌డిఒ కార్యాలయాలు, జలవనరుల శాఖ, ట్రాన్స్‌కో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశాయి. మూడు జిల్లాల కలెక్టర్లు తుఫాన్ సన్నాహక చర్యలపై వివిధ శాఖల అధికారులతో శనివారం సమీక్షించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 27,28,29 తేదీల్లో అన్ని పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. తుపాను తీరం దాటే సమయంలో కాకినాడ జిల్లాపై తీవ్ర ప్రభావం పడనుంది. భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందన్న హెచ్చరికలతో గ్రామ స్థాయిలో సిబ్బంది అంతా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. కాకినాడ, కోనసీమ జిల్లాల్లో లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి కార్యాచరణ రూపొందించారు. తుపాను పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. నిత్యావసరాలను తగిన ప్రదేశాల్లో ఉంచేలా పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లు చేస్తోంది.


ఎస్.యానంలో సముద్రపు అలల ఉధృతి


ఎన్.కొత్తపల్లి తీర గ్రామంలో అధికారులు ఎన్‌డిఆర్‌ఎఫ్ దళాలు

భయం గుప్పిట్లో తీర గ్రామాలు

ఉప్పలగుప్తం: తుపాను తీర గ్రామాల్లో ప్రభావం చూపుతోందన్న అధికారుల ముందస్తు హెచ్చరికలతో తీర గ్రామాలు భయం గుప్పెట్లో బిక్కుబిక్కుమంటూ ఉన్నాయి.మండలంలోని తీర గ్రామాలైన ఎన్.కొత్తపల్లి, రాఘవుల పేట, ఎస్.యానం, వాసాలతిప్ప గ్రామాల్లో అధికారులు పోలీసులు, ఎన్‌డిఆర్‌ఎఫ్ దళాలు గస్తీ తిరుగుతూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. సముద్రం అల్లకల్లోలంగా ఉన్న నేపథ్యంలో ఎస్.యానం, వాసాలతిప్ప తీరంలో సముద్రంపై చేపల వేటకు వెళ్లే వలస మత్స్యకారులను అధికారులు అప్రమత్తం చేసి వేటకు వెళ్లకుండా వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ క్రమంలో వలస మత్స్యకారులు తమ ఇంజిన్‌తెప్పలను సముద్రపు ఒడ్డుకు చేర్చి బిక్కుబిక్కుమంటూ కూర్చున్నారు. **రాజోలు:** తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. కలెక్టరేట్‌లో పాటు రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూంలను ఏర్పాటు చేశారు.


వాసాలతిప్పలో సముద్రపు ఒడ్డుకు చేర్చిన ఇంజిన్‌తెప్పలు

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వరిచేలకు నష్టం వాటిల్లిందని ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతుల అన్నారు. అయితే ఒక వైపు మొంథా తుపాను ముప్పు పొంచి ఉండటంతో రైతులు బెంబేలెత్తుపోతున్నారు. ఏం చేయాలో తెలియక రైతులు దిక్కు తోచని పరిస్థితిలో ఉన్నారు. ఆదివారం వాతావరణం అనుకూలించడంతో కోసిన వరి పంటను రోడ్ల పక్కన, కళ్లాలలో వేసి ధాన్యం ఆర బెట్టుకుంటున్నారు. కోసిన విత్తనాల ధాన్యం వర్షాలకు రంగు మారిందని ఏం చేయాలో పరిస్థితి తెలియడం లేదని రైతులు వాపోతున్నారు. పడిపో యిన వరిచేలు మొలకెత్తే పరిస్థితిలోఉందని, మళ్లీ వర్షాలు పడితే వాటి పరిస్థితి ఏంటో అర్థం కాని స్థితి లో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. **రామచంద్రపురం:** అల్పపీడన ప్రభావంతో కొద్దిరోజు లుగా భారీ వర్షాలు కురిశాయి. అయితే ఆదివారం వర్షం కురవక పోవ డంతో రైతులు తొలకరి పంట ధాన్యాన్ని రోడ్ల పైకి తెచ్చుకొని మాసూళ్లు చేసుకున్నారు. మళ్లీ మొంథా తుపాను కారణంగా నాలుగు రోజులు పోటు వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో రైతులు అప్రమత్తమై రోడ్లపైకి తెచ్చుకొని విత్తనాల వరిని మాసూళ్లు చేసు కుని, ధాన్యం రోడ్లపైన భద్రపరుచు కుంటున్నారు. ఇప్పటికే 20 శాతం పైగా పంట నేలవాలి ఆందోళన చెం దుతున్న రైతులు మళ్లీ తుపాను వస్తే పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రామ చంద్రపురం మండలంలోని పలు ప్రాంతాల్లో, కె.గంగవరం మండలంలోని అధిక శాతం వరిచేలు నేలవాలాయి.


కపిలేశ్వరపురంలో ధాన్యం ఆరబెట్టకుంటున్న రైతులు

పేదలకు అండగా సిఎం సహాయ నిధి

ప్రజాశక్తి- రాజోలు

పేదలకు సిఎం సహాయ నిధి అండగా నిలుస్తోందని రాజోలు ఎంఎల్ఎ దేవవరప్రసాద్ అన్నారు. ఆదివారం మలికిపురంలో ఎంఎల్ఎ క్యాంప్ కార్యాల యంలో నియోజకవర్గానికి చెందిన 38మంది లబ్ధిదారులకు సిఎం సహాయ నిధి చెక్కులు రూ.32 లక్షలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.5కోట్ల మొత్తాన్ని 600 మంది లబ్ధిదారులకు వైద్య సహాయం నిమిత్తం అందించామని తెలిపారు. సిఎం సహాయ నిధి ముఖ్యంగా పేదలు లబ్ధి పొందాలని రూపొందించిన కార్యక్రమం అని అన్నారు. కార్యక్రమంలో టిడిపి రాజోలు ఇన్‌ఛార్జి గొల్లపల్లి అమూల్య, డెల్టా ఛైర్మన్ గుబ్బల శ్రీనువాస్, మార్క్ ఫ్యాడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, చాగంటి స్వామి పలువురు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్ఎ దేవ వరప్రసాద్

తాతాజీని సత్కరించిన నాయకులు

ప్రజాశక్తి - అయినవిల్లి

వైసిపి రాష్ట్ర జాయింట్ సెక్రెటరీగా వాసంశెట్టి తాతాజీ ఇటీవల నియమితులయ్యారు. ఆదివారం నేదునూరి పెదపాలెంలో తాతాజీని స్వగృహంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సత్కరించి అభినంద నలు తెలియజేశారు కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర బూత్ కమిటీ వింగ్ సెక్రెటరీ చేట్ల రామారావు, మానేపల్లి గ్రామ ఉప సర్పంచ్ ఉండ్రాజవరపు దుర్గారావు, పి.గన్నవరం మండల విద్యార్థి విభాగం అధ్యక్షుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.


తాతాజీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు


వేడుకల్లో పాల్గొన్న బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, నాయకులు

ఘనంగా శ్రీకాంత్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - అమలాపురం


వైసిపి నాయకుడు పినిపే శ్రీకాంత్ పుట్టినరోజు వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు రాష్ట్ర వైసిపి యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అభిమానులు కేక్ కట్ చేసి స్వీట్లు, పండ్లు పంపి ణీ చేశారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పినిపే విశ్వరూప్, మాజీ ఎంఎల్ఎ, వైసిపి జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, ఎంఎల్‌సి బొమ్మి ఇజ్రాయిల్, కర్రి పాపారాయుడు, పిల్లి సూర్య ప్రకాష్ రావు, దవులూరి దొరబాబు, జక్కంపూడి గణేష్, పితాని బాలకృష్ణ, పాముల రాజేశ్వరి దేవి తదితరులు పాల్గొన్నారు.

పద్మ అవార్డు గ్రహీత కోటేశ్వరరావుకు సత్కారం

ప్రజాశక్తి - మామిడికుదురు

పద్మ ప్రతిభ అవార్డు అందుకున్న కారుపర్తి కోటేశ్వరరావుని ఆదివారం మొగలికుదురు (జగ్గన్నపేట)లో శ్రీ భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో జగ్గన్నపేట దేవాంగ సంక్షేమ సంఘం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో యక్కల మోహార్ బాబా తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



తుపానును ఎదుర్కొనేందుకు యంత్రాంగం సన్నద్ధం

- కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్
- 27, 28, 29 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా అన్ని విద్యాసంస్థలకూ సెలవు


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

ప్రజాశక్తి - అమలాపురం

మొంథా తుపానును ఎదుర్కొంనేందుకు అధికార యంత్రాగాన్ని సన్నద్ధం చేశామని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. తుఫాను ప్రభావంతో జిల్లాలో రానున్న 4 రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు 100 నుండి 120 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని ఆయన వెల్లడించారు.ఆదివారం స్థానిక కలెక్టరేట్ నందు పాత్రికేయులు సమావేశం నిర్వహించి మొంథా తుపాను ప్రభావం, విపత్తును ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం ఈ నెల 27, 28, 29 తేదీలలో తుపాను ప్రభావం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఈనెల 28న సాయంత్రం తుపాను కాకినాడ జోన్ నందు తీరాన్ని దాటే అవకాశ ముందన్నారు. జిల్లా యంత్రంగాన్ని అప్రమత్తం చేసి క్షేత్రస్థాయి ఉద్యోగులకు విపత్తును ఎదుర్కొనేందుకు విధులు కేటాయించామన్నారు. సముద్రతీరం వెంబడి ఉన్న తుపాను పునరావాస కేంద్రాలను సిబ్బందితో సిద్ధం చేసి భోజన వసతిని కల్పించేందుకు సమాయత్తపరిచామన్నారు. సముద్ర తీరం వెంబడి 34 ఆవాసాలలో సుమారు 6000 మంది ప్రజానీకం ఉందన్నారు. వారిని తుపాను హెచ్చరికలకు అనుగుణంగా తరలించేందుకు కార్యా చరణ సిద్ధం చేశామన్నారు. తరలింపు ప్రణాళికకు కూడా మానవ వనరులు, పడవలను సిద్ధం చేసినట్లు తెలిపారు. రాబోయే 4 రోజులు అనవసర ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని ఆయన స్పష్టం చేశారు. రాబోయే 15 రోజులలో ప్రసవ తేదీలు ఉన్న గర్భిణులను వైద్యులు గుర్తించి సమీప పిహెచ్‌సి, సిహెచ్ కేంద్రాలలోని బర్త్ వెయిటింగ్ హాల్ కు సురక్షిత ఆసుపత్రి ప్రసవాల నిర్వహణ నిమిత్తం తరలించడం జరిగిందన్నారు. జిల్లా వ్యా ప్తంగా 428 మంది గర్భిణు లను గుర్తించి తరలించామన్నారు. జిల్లాలో90 కిలో మీటర్ల మేర తీర ప్రాంతం ఉందని మూడు కిలోమీటర్లకు ఒక ఇన్‌ఛార్జి సిబ్బందిని నియమించి హెచ్చరికలకు అనుగుణంగా మెరైన్ పోలీస్ సమన్వయంతో సహాయక చర్యలు నిమిత్తం చర్యలు తీసుకున్నామని అన్నారు. బీచ్ ప్రాంతంలో ఎవరు సంచరించరాదన్నారు. సముద్రంపై చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులను తీరానికి రప్పించడం జరిగిందని, పడవలను కూడా ఫిష్ లాండింగ్ కేంద్రాల నందు మత్స్యశాఖ ఆధ్వర్యంలో భద్రపరిచినట్లు వెల్లడించారు. జిల్లా కేంద్రం డివిజన్, మండల కేంద్రాలలో కంట్రో ల్ రూమ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో 08856బి 293104 నెంబర్‌లో సంప్రదించి సహాయక చర్యలు పొందవచ్చు నన్నారు. జిల్లాలో తుపాను సహాయక చర్యలు నిమిత్తం ఒక ఎన్‌డిఆర్‌ఎఫ్ బందం ఉందని మరో ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందం రానున్నద న్నారు. ఈ విధంగా అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు విపత్తును ఎదుర్కొనేందుకు తీసుకున్నామని అన్నారు. ఎపిఇపిడిసిఎల్ వారు 3,000 కరెంటు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు మెటీరియల్ విద్యుత్ పునరుద్ధరణ కొరకు తీర ప్రాంత వెంబడి ఉన్న సబ్‌స్టేషన్లలో భద్రపరిచారన్నారు. అదే విధంగా మానవ వనరులను సిద్ధం చేశామన్నారు. ఈదురు గాలులకు చెట్లు కూలి రహదారి రాకపోకలకు అడ్డం కులు ఏర్పడిన నేపథ్యంలో వాటిని తొలగించి రహదారి పునరుద్ధరణకు పవర్ రంపాలు జెసిబిలు క్రేన్లు సిద్ధం చేసినట్లు తెలిపారు. నియోజకవర్గ, మండల స్థాయి ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన ప్రాంతాలో తప్పనిసరిగా ఉండాలన్నారు. ముంపునకు గురయ్యే ప్రాంతాలను హెచ్చరికలకు అనుగుణంగా ముందుగా గుర్తించి పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. మొంథా తుఫానును తేలికగా తీసుకోరాదని, మరింత తీవ్ర ప్రభావాన్ని చూపే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరి కల నేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రత్యేకించి మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన కేంద్రాలలో తప్పనిసరిగా ఉంటూ తుపాను సందర్భంగా ఎప్పటికప్పుడు తలెత్తే పరిస్థితులపై ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసు, రెవెన్యు, అగ్ని మాపక శాఖ, ఇరిగేషన్, పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బి తదితర అనుబంధ శాఖలు సమన్వయము చేసుకుంటూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. వరి పంట కోత దశకు వచ్చినందున కాలువలలో నీటి ప్రవాహాన్ని మూడు రోజులపాటు తుపాను నేపథ్యంలో పంటలు ముంపు బారిన పడకుండా నిలుపుదల చేసినట్లు తెలిపారు. అదేవిధంగా డ్రెయినేజీలు పూర్తిగా ఓపెన్ చేసి మురికి నీరు పారేలా చర్యలు తీసుకున్నా మన్నారు. తీరప్రాంతాల్లోని సిగ్నల్ అంతరాయం కలగకుండా సెల్‌టవర్ల వద్ద జనరేటర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రజలకు అవసరమయ్యే నిత్యావసర సరుకులను కూడా ముందస్తుగానే సమకూర్చుకొని ఉంచుకో వాలన్నారు. ఈ కార్యక్రమం లో ఎఒ కాశీ విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కంట్రోల్ రూమ్ పనితీరును ఈ సందర్భంగా ఆయన పరిశీ లించారు. మొంథా తుఫాన్ తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉన్నందున డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఈనెల 27, 28, 29 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని విద్యాసంస్థలకూ తాత్కాలిక సెలవులు ప్రకటించారు.

ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

తుపాను దృష్ట్యా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ , పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల కలెక్టరేట్, ఎస్పీలతో ఫోన్లో మూడు జిల్లాల అధికారులతో రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడారు.తీరప్రాంత ప్రజలకు తుఫానుపై అవగాహన కల్పించి వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని మంత్రి అధికారులను సూచించారు.

నేటి నుంచి 'దీప్తి' ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - మామిడికుదురు

మామిడికుదురు దీప్తి విద్యా సంస్థల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం(ఎన్‌ఎస్‌ఎస్) విద్యా ర్థులచే ఈ నెల 27 నుంచి నవంబర్ 2 వరకు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని కరస్పాం డెంట్ డివివి.సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు దీప్తి జూనియర్ కళాశాల (ఎన్ఎస్ ఎస్) విభాగం ప్రోగ్రాం ఆఫీసర్ ఎ.ఈశ్వరరావు పర్యవేక్షణలో మాకనపాలెంలో సర్పంచ్ మద్దాల బాబు రావు మరియు స్థానికుల సహకారంతో సేవా కార్యక్రమాలు ఏడు రోజులు పాటు నిర్వహిరస్తారని అన్నారు.. దీప్తి డిగ్రీ కళాశాల (ఎన్‌ఎస్‌ఎస్) ప్రోగ్రామ్ ఆఫీసర్ పి.సుబ్బారావు పర్యవేక్షణలో కొమరాడ లో సర్పంచ్ వలవల సత్యవేణి సత్యమూర్తి మరియు గ్రామస్తుల సహకారంతో ఏడు రోజులపాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు పరిసరాల పరిశుభ్రత అక్షరాశ్యతపై అవగాహనా సదస్సులు, శానిటరీ, మొక్కలు నాటుట వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



సంస్మరణ సభలో మాట్లాడుతున్న రవిచంద్ర

పోరాట యోధుడు సాయిబాబా

ప్రజాశక్తి - అమలాపురం

అమలాపురం వాసి ప్రజా హక్కుల పోరాట యోధుడు ప్రొఫెసర్ గోకరకొండ నాగసాయిబాబాను స్ఫూర్తిగా తీసుకుని ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని ప్రొఫెసర్ సాయిబాబా స్మారక జాతీయ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ రవిచంద్ర పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభ పౌరహక్కుల సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించి సాయిబాబాకు ఘన నివాళులు అర్పించారు. పౌర హక్కుల సంఘం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షులు జిల్లెల్ల మనోహరం అధ్యక్షతన జరిగిన ఈ సభకు ముఖ్య వక్తలుగా విచ్చేసిన రవిచంద్ర సాయిబాబా, సోదరుడు రాందేవ్‌లు ప్రసంగించారు. ఈ సభలో పిడిఎస్ యు విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రేవు తిరుపతిరావు, డిబిఎంఎస్ జాతీయ కన్వీనర్ కొంకి రాజామణి, రైతు కూలీ సంఘం కొండా దుర్గారావు, ఆర్‌టిసి యునైటెడ్ వర్కర్స్ యూనియన్ జి.శ్రీనివాస్, సిపిఐ జిల్లా కార్యదర్శి సత్తిబాబు, సామాజికవేత్త భరద్వాజ్ సాయిబాబా కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

935 స్కౌట్, గైడ్స్ యూనిట్ల ఏర్పాటు

ప్రజాశక్తి - రావులపాలెం

రాష్ట్రంలోని 935 పిఎంశ్రీ పాఠశాలలో స్కౌట్ అండ్ గైడ్స్ యూనిట్లు ఏర్పాటు చేసినట్లు స్కౌట్ అండ్ గైడ్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు.స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న స్కౌట్ టీచర్స్ క్యాంప్ ను ఆయన ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థి జీవితానికి స్కౌట్ అండ్ గైడ్ దిశా నిర్దేశమన్నారు. పిఎంశ్రీ పాఠశాలల్లో విద్యార్థులతో స్కౌట్ ప్రూఫ్‌లు ఏర్పాటు చేశామన్నారు. బాల బాలికలకు వేర్వేరుగా స్కౌట్ గ్రూపులు ఏర్పాటు చేసి వారికి క్రమం తప్పకుండా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. స్కౌట్ అండ్ గైడ్స్ నిమిత్తం సమగ్ర శిక్ష కార్యాలయం ద్వారా ప్రతి పాఠశాలకు రూ.50వు లు మంజూరైనట్లు ఆయన తెలిపారు. తరగతి గదుల్లో స్కౌట్ అండ్ గైడ్స్‌కు పీరియడ్లు కూడా కేటాయించినట్లు తెలిపారు. స్కౌట్ అండ్ గైడ్ యూనిట్లు సమర్థవంతంగా పనిచేసే విధంగా పర్యవేక్షణ కూడా జరుగుతుందన్నారు. అలాగే శిక్షణ శిబిరం కోఆర్డినేటర్ పి.రాంబాబు మాట్లాడుతూ తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాలకు చెందిన 77 మంది కౌంట్ మాస్టర్లకు బేసిక్, అడ్వాన్స్ ట్రైనింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ శిబిరంలో కాకినాడ జిల్లా సెక్రెటరీ ఎంవి.సత్య నారాయణ, ఎల్ఒసి నారాయణ, జెఎన్‌వి.గోపాల కృష్ణ, కట్ట కృష్ణప్రసాద్, బ్రహ్మేశ్వరరావు, అజారుద్దీన్, శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. అనంతరం సర్టిఫికెట్లు అందజేశారు.


స్కౌట్ మాస్టర్స్‌కు బేసిక్ సర్టిఫికెట్లు అందజేస్తున్న శ్రీనివాస్, రాంబాబు తదితరులు

రవికుమార్ దీక్షకు వికలాంగుల సంఘీభావం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నిరుపయోగంగా ఉన్న ఆర్‌టిసి బస్టాండ్‌ను వెంటనే పునరుద్ధరించి, బస్సులను నడపాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి చికురుమిల్లి రవి కుమార్ చేపట్టిన రిలే దీక్షకు వికలాంగులు సంఘీభావం తెలిపి దీక్షలో పాల్గొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక సమైఖ్యాంధ్ర శిబిరం వద్ద రవి కుమార్ చేస్తున్న రిలే దీక్ష ఆదివారం 16వ రోజుకు చేరుకుంది. ఈ దీక్షకు పొట్టిలంకకు చెందిన రెండు కాళ్లు పనిచేయని వికలాంగుడు బక్కి నరసింహమూర్తి సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా దీక్షలో పాల్గొన్న నరసింహమూర్తి మాట్లాడుతూ సామాజిక కార్యకర్త రవికుమార్ ప్రజా ప్రయోజనార్థం ప్రయాణికులు, విద్యార్థులు, మహిళలు, గర్భిణులు, వృద్ధులు ఇబ్బందులు పడకుండా బస్టాండ్ లోనే బస్‌లు ఎక్కి, దిగే విధంగా మౌళిక సౌకర్యాలు కల్పించి, నిరుపయోగంగా ఉన్న బస్టాండ్ లో 24 గంటలు బస్‌లు తిరిగేలా చర్యలు తీసుకోవాలని దీక్ష చేస్తుంటే అధికారులు స్పందించకపోవడం దీక్ష చేస్తుంటే అధికారులు స్పందించకపోవడం శోచనీయమని అన్నారు. ఇప్పటికైనా అధికారుల నిర్లక్ష్యం వీడి తక్షణమే నిరుపయోగంగా ఉన్న ఆర్టిసి బస్టాండ్‌కు బస్సులు రాకపోకలు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి ఉద్యమించేలా కార్యాచరణను రూపొందించి పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. రవి కుమార్‌కు సంఘీభావంగా దీక్షలో రిపబ్లికన్ పార్టీ నాయకుడు పంతగడి నరసింహమూర్తితో పాటు పోతుల హేమ సుందర రావు, వడ్డీ దేవి శ్రీకృష్ణ, జనసేన పార్టీకి చెందిన గుర్రాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


రవికుమార్‌తో దీక్షలో పాల్గొన్న నరసింహమూర్తి తదితరులు

బాల బాలాజీ ఆదాయం రూ.2.73 లక్షలు

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ దేవస్థానానికి ఆదివారం వివిధ విభాగాల ద్వారా రూ. 2,73,638 ఆదాయం సమకూరిందని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు తెలిపారు ఇందులో శాశ్వత నిత్యాన్నదానట్రస్ట్‌కు రూ.21,232బ, నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.77,169 ఆదాయం వచ్చిందన్నారు. ఆరు వేల మంది యాత్రికులు స్వామివారిని దర్శనం చేసుకోగా 2,500 మంది యాత్రికులు అన్న ప్రసాదం స్వీకరించారన్నారు.

నేరాలు ఘోరాలు

బెదిరింపులపై ఫిర్యాదు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

కులం పేరుతో దూషిస్తూ ప్రయివేటు ఫైనాన్స్ సంస్థ రికవరీ ఏజెంట్ బెదిరింపులకు పాల్పడుతున్నాడని భీమవరపు వి.సూర్యరాజు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రాజేలంక గ్రామానికి చెందిన సూర్యరాజు రెండేళ్ల క్రితం ఫైవ్‌స్టార్ ఫైనాన్స్‌లో రుణం తీసుకున్నాడు. వాయిదాల పద్ధతిలో సక్రమంగా చెల్లింపులు చేస్తున్నానని ఆయన తెలిపాడు. అయితే ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా ఈ నెల వాయిదా గడువు ఇంకా ఉన్నప్పటికీ, రికవరీ బాయ్ సుంకర స్వామి తక్షణమే చెల్లించాలని తీవ్ర ఒత్తిడి చేస్తూ, కులం పేరుతో దూషించడమే కాకుండా దుర్భాషలాడుతూ భయ భ్రాంతులకు గురి చేస్తున్నాడని సూర్యరాజు అన్నారు. స్వామి నుంచి తనకు తన కుటుంబానికి ప్రాణహాని ఉందని, కాల్ మనీ వేధింపులకు పాల్పడుతున్న స్వామిపై కేసు నమోదు చేసి రక్షణ కల్పించాలని సూర్య రాజు పోలీసులకు ఫిర్యాదుచేశాడు.



అన్నంపల్లి టోల్ ప్లాజా వద్ద రవాణాశాఖ అధికారుల తనిఖీలు

మూడు ట్రావెల్స్ బస్సుల సీజ్

ప్రజాశక్తి - ముమ్మిడివరం

కర్నూలు ట్రావెల్ బస్ ఘటన నేపథ్యంలో రవాణా శాఖ అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. మండలంలోని అన్నంపల్లి టోల్ ప్లాజా వద్ద శనివారం రాత్రి చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో మూడు ప్రయివేటు ట్రావెల్స్ బస్సులపై కేసులు నమోదు చేసి సీజ్ చేశామని, అలాగే నాలుగు బస్సులపై ఇతర కేసులు నమోదు చేసి రూ.20,000 వేలు అపరాధ రుసుము విధించామని జిల్లా రవాణా శాఖ అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. సీజ్ చేసిన మూడు బస్సులలో అనధికారికంగా సీట్ల మార్పిడి చేసినట్లు గుర్తించామని, ఇది మోటారు వాహనాల చట్టం ఉల్లంఘన కింద మూడు బస్సులను సీజ్ చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు అప్పగించామని శ్రీనివాసరావు తెలిపారు. సీజ్ చేసిన బస్సులు యానాం నుంచి హైదరాబాద్ కి నిత్యం తిరుగుతున్నాయని, ఇకపై తనిఖీలను ముమ్మురం చేస్తామని ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, జ్యోతి సురేష్, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన వారి అప్పగింత

ప్రజాశక్తి - గండేపల్లి

తప్పిపోయిన ఇద్దరిని గుర్తించి ఆదివారం వారి కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించారు. ఎస్ఐ శివనాగు తెలిపిన వివరాల ప్రకారం.. కరప మండలానికి చెందిన డి.హర్ష ఆర్థిక ఇబ్బందులతో 4 రోజుల క్రితం మురారిలోని అంతరింటికి వచ్చాడు. అక్కడ నుంచి కన్పించకుండా పోయాడు. దీంతో అతని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే మండలంలోని నీలాద్రిరావుపేటకు ఎన్.దేవి కుటుంబ కలహాలతో ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె కుటుంబ సభ్యులు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయా ఫిర్యాదులపై మిస్సింగ్ కేసులు నమోదు చేసి ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఎఎస్ఆర్ జిల్లా అరకు వాలీలో హర్షను పట్టుకున్నామని, అలాగే దేవిని గొల్లప్రోలులో గుర్తించి స్టేషన్‌కు తీసుకొచ్చి వారి వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. ఆయా కుటుంబాలకు చెందిన సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

172 కిలోల గంజాయి స్వాధీనం, ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి -కొవ్వూరు

కొవ్వూరు టోల్గేట్ సమీపంలో ఆదివారం 172 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ అధికారి సిహెచ్.లావణ్య తెలిపారు. డొంకరాయి నుంచి ఆటోలో తీసుకువచ్చిన గంజాయి ప్యాకెట్లను కంటైనర్ లారీలో ఎగుమతి చేస్తుండగా పట్టుకున్నామని ఆమె తెలిపారు. లారీ డ్రైవర్, ఆటో డ్రైవర్, లారీ క్లీనర్‌ను అదుపులో తీసుకున్నట్లు ఆమె తెలిపారు. గంజాయి తరలింపునకు వినియోగించిన ఆటోతో పాటు కంటైనర్ లారీని స్వాధీనం చేసుకున్నట్లు ఆమె తెలిపారు. కొవ్వూరు సిఐ పి.సత్యనారాయణ ఎస్ఐలు రవిశంకర్ బాలాజీ, జి.సత్యనారాయణ పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని పరిశీలించిన చినరాజప్ప


ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక భీమేశ్వర ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అత్యవసర వైద్య శిబిరాన్ని ఆదివారం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పరిశీలించారు. ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులకు అవసరమైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ బళ్ల నీలకంఠం, ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కంటే జగదీష్‌మోహన్, రాష్ట్ర గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్, టిడిపి నాయకులు అడబాల కుమారస్వామి, వల్లూరి దొరబాబు, ట్రస్ట్ బోర్డ్ సభ్యులు గొల్తి సత్యనారాయణ, తాతపూడి అరుణ్‌వంశీ పాల్గొన్నారు.

సురక్ష యాప్‌తో నకిలీ మద్యానికి అడ్డుకట్ట

జిల్లా మద్యనిషేధ, అబ్కారీ అధికారి సిహెచ్.లావణ్య





ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో నకిలీ మద్యం నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామని జిల్లా మద్యనిషేధ మరియు అబ్కారీ అధికారి సిహెచ్.లావణ్య స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నకిలీ మద్యం కలకలం మొదలైన విషయం విధితమే. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సురక్ష యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. మరోవైపు జిల్లా ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు నిరంతరం నిఘా పెంచారు. ఈ నేపథ్యంలో జిల్లాలో నకిలీ మద్యం కార్యకలాపాల నియంత్రణ చేపట్టిన చర్యలపై ప్రజాశక్తి ముఖాముఖిలో లావణ్య వివరించారు.

అందుబాటులో ఏపి సురక్ష యాప్ ఉందా?

నకిలీ, కల్తీ మద్యపాన పదార్థాల నియంత్రణకు అబ్కారీ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'సురక్ష – ఏపీ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ అనే మొబైల్ యాప్‌ను రూపొందించింది. ఈ యాప్ ద్వారా ప్రజలు తాము కొనుగోలు చేసిన మద్యం సీసాపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి, ఆ మద్యం ప్రభుత్వ అనుమతితో విక్రయించబడినదా లేదా అనే విషయాన్ని సులభంగా తెలుసుకోవచ్చు. సీసాపై ఉన్న క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయగానే ఆ బాటిల్ యొక్క నిజమైన వివరాలు, బ్రాండ్ పేరు, లైసెన్స్ వివరాలు, తయారీ స్థలం మొదలైనవి ఫోన్ స్క్రీన్‌పై కనిపిస్తాయి. నకిలీ లేదా చట్టవిరుద్ధమైన మద్యం అయితే, వెంటనే హెచ్చరిక సందేశం వస్తుంది.

యాప్ డౌన్‌లోడ్ విధానం ఎలా..?

ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్ల ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉంటుంది. సురక్ష –ఎపి ఎక్సయిజ్ డిపార్ట్‌మెంట్ అని పేరు ఉంటుంది. ఇన్స్టాల్ చేసిన తర్వాత రెండు ఎంపికలు కనిపిస్తాయి. ఒకటి – వినియోగదారుల కోసం, ఇంకొకటి – మద్యం షాపు నిర్వాహకుల కోసం. ప్రజల సురక్షిత మద్యం వినియోగాన్ని నిర్ధారించడానికి 'ఎక్సైజ్ శాఖ సురక్ష' యాప్‌ను ఉపయోగించాలి. యాప్ ఓపెన్ చేసిన తర్వాత బాటిల్‌పై ఉన్న క్యూఆర్‌కోడ్ స్కాన్ చేయాలి. నకిలీ మద్యం అయితే 'డిటెయిల్స్ నాట్ ఫౌండ్' అని కనిపిస్తుంది. యాప్‌లోని సమాచారం జిల్లా కేంద్రంలోని అధికారుల మరియు రాష్ట్ర స్థాయి అధికారుల డేటాబేస్‌కు పంపబడుతుంది.

జిల్లాలో నకిలీ మద్యం కార్యకలాపాలు..?

జిల్లాలోని 138 మద్యం దుకాణాలు, 20 బార్లలో నాణ్యత తనిఖీలు జరుగుతున్నాయి. ప్రజారోగ్యం, సామాజిక శాంతి, భద్రత పరిరక్షణను అత్యంత ప్రాధాన్యంగా తీసుకొని, అక్రమ మద్యం తయారీ, రవాణా, విక్రయాలు, నాటుసారా, కల్తీ కల్లు, అనుమతిలేని మద్యం విక్రయ కేంద్రాలపై నిరంతర దాడులు నిర్వహిస్తూ, వాటిలో పాల్గొనే వ్యక్తులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటున్నాము. జిల్లాలోని 7 ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్లు, ఇ.ఎస్ టాస్క్ ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు సమన్వయంతో అన్ని మద్యం షాపులు, బార్లు, పర్మిట్ రూములు, ఇండస్ట్రియల్ ఏరియాలు, పాడుబడ్డ భవనాలు, మారుమూల ప్రాంతాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయడం జరుగుతోంది. ఇప్పటి వరకు జిల్లాలో నకిలీ మద్యం తయారీ లేదా విక్రయాల కార్యకలాపాలు లేవు.

జిల్లాలో మద్యం శాంపిల్స్‌ను సేకరిస్తున్నారా..?

ఈ నెల 16వ తేదీ నుంచి ఇప్పటివరకు 574 శాంపిళు సేకరించి, రీజనల్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ల్యాబ్‌కు పంపగా, ఎక్కడా కల్తీ మద్యం ఆనవాళ్లు లభించలేదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధ్వర్యంలో విడుదలైన 'ఏపి ఎక్సైజు సురక్ష' యాప్ ద్వారా మద్యం కొనుగోలు చేసే వారు బాటిల్ మూతపై ఉన్న సీల్‌ను స్కాన్ చేసి, అది నిజమైనదా లేక నకిలీదా తెల్సుకోవచ్చు. నకిలీదని అనిపించిన పక్షంలో వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 14405 సమాచారం అందించగలరని విజ్ఞప్తి చేస్తున్నాను.

నాటు సారా నియంత్రణపై చర్యలు..?

నాటుసారాయి తయారీ, అక్రమ విక్రయాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాము. నాటుసారాను అరికట్టడంలో ప్రజల సహకారం అత్యవసరం. అనుమానాస్పద మద్యం తయారీ లేదా రవాణా గురించిన సమాచారం ఉన్నట్లయితే సమీప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌కు లేదా టోల్ ఫ్రీ నంబర్ 14405 కి తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాము. అటువంటి సమాచారం ఇచ్చిన వారి వివరాలు విషయంలో గోప్యత పాటించడం జరుగుతుంది.

నకిలీ మద్యం నియంత్రణపై నిఘా..?

జిల్లాలోని అన్ని తెరిచి ఉన్న గోడౌన్లు, నిల్వ కేంద్రాలు మరియు అనుమానాస్పద ప్రాంగణాలను క్రమం తప్పకుండా తనిఖీ చేస్తున్నాము. నకిలీ మద్యం సరఫరా లేదా పంపిణీ జరగకుండా నిరోధించేందుకు నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేశాము. అలాగే పార్సిల్ కార్యాలయాలు, ప్రయివేట్ రవాణా నిర్వాహకులు, ఆర్టీసి పార్సిల్ సేవలు, రైల్వే పార్సిల్ కార్యాలయాలు మరియు బస్ డిపోలు వారానికోసారి తనిఖీ చేయబడుతున్నాయి. ఈ నిరంతర నిఘా చర్యల ద్వారా గోదావరి జిల్లాలో అక్రమ మద్యం తరలింపులు ముందస్తుగా గుర్తించి, వాటిని వెంటనే అడ్డుకునేలా చర్యలు కొనసాగుతున్నాయి.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

ప్రజాశక్తి - కాకినాడ

నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలని యుటిఎఫ్ నేతలు సూచించారు. ఆదివారం స్థానిక యుటిఎఫ్ హోంలో నూతనంగా ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించిన ఉపాధ్యాయులకు సర్వీస్, లీవ్ రూల్స్‌పై జిల్లా స్థాయి అవగాహనా సదస్సు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు సిహెచ్.సూరిబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు ఉన్న సెలవు నిబంధనలు, సర్వీస్ కండిషన్స్ సూర్య సీతారామారావు వివరించారు. యూటిఎఫ్ సీనియర్ నాయకుడు ఐ.ప్రసాదరావు 'యూటిఎఫ్ విశిష్టత – ఆశయాలు'పై బోధించారు. అప్పారి వెంకటస్వామి, డి.రామిరెడ్డి, మైనేని వెంకటరత్నం వంటి నాయకులు ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేశారని, ఉద్యమం కోసం తమ జీవితాలను, జీతాలను త్యాగం చేశారని గుర్తు చేశారు.



బలుసుతిప్పలో పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

పునరావాస కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి - కాట్రేనికోన

మండల పరిధిలోని తీర ప్రాంత మత్స్యకార గ్రామమైన బలుసుతిప్ప గ్రామంలో బహుళ ప్రయోజన తుపాను ఆశ్రమ భవనాన్ని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సందర్శించి ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను పునరావాస కేంద్రాల్లోని విభాగాలు, తాత్కాలిక నివాసం ద్వారా తీర ప్రాంత ముంపు బాధితులకు తక్షణ భద్రత, ఆరోగ్య పరిరక్షణ,ఆహార భద్రత, తాత్కాలిక నివాసం పూర్తిస్థాయిలో కల్పనకు అధికారులు తగు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పునరావాస కేంద్రాన్ని అత్యంత పరిశుభ్రంగా ఉండేటట్లు తీర్చిదిద్దాలన్నారు. తుపాను పున రావాస కేంద్రం లోని వివిధ భాగాలు ముంపు బాధితు ల తాత్కాలిక నివాసానికి అన్ని ఏర్పాట్లు చేయా లన్నారు. తుపాను పునరావాస కేంద్రం తుఫాను, వరదల వల్ల నివాసాలు కోల్పోయిన ముంపు బాధితులకు తాత్కాలిక వసతి ఆహార, భద్రత, ఆరోగ్య సేవలు అందించి అన్ని విధాల ఆదుకునే దిశగా అధికా రులు చర్యలు తీసుకోవాలన్నారు. బాధితులు నివాసం ఉండే ప్రాంగణం గదులను కుటుంబాల అవసరానికి అనుగుణంగా ఉంచాలన్నారు. వంటశాల పరిశుభ్రంగా నిర్వహించాలని, ముంపు బాధితులకు ఉచిత ంగా ఆహారం, సురక్షిత తాగునీరు, పిల్లలకు పాలు సరఫరా చేయాలన్నారు. తాత్కాలిక టాయి లెట్లు, శానిటేషన్ సదుపాయాలు పూర్తిస్థాయిలో కల్పించాలని అన్నారు. ఆరోగ్య శిబిరాల ద్వారా రోగనిర్ధారణ, ప్రాథమిక వైద్య సహాయం, అత్యవసర మెడికల్ కిట్, మాత శిశు ఆరోగ్య సేవలు అందిం చాలని అన్నారు. భారీ వర్షాలు నీటి ముంపుతో అనా రోగ్య సమస్యలు తలెత్తకుండా తాగునీరు, వైద్య పరమైన సాయం అందించాలని అధికారులకు సూచి ంచారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రవి కిరణ్, ప్రత్యేక అధికారి జి.మమ్మీ, ఎస్ఐ అవినాష్ తదితరులు పాల్గొన్నారు.



సఖినేటిపల్లి రేవు పంటు(ఫైల్ ఫోటో)

సఖినేటిపల్లి రేవులో పంటు రాకపోకల నిలిపివేత

ప్రజాశక్తి - సఖినేటిపల్లి

జిల్లాలోని సఖినేటిపల్లి లంక, పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంల మధ్య వశిష్ట గోదావరిపై నిర్వహించే పంటు ప్రయాణాన్ని ప్రయా ణికుల భద్రత దృష్ట్యా ఆదివారం అధికారులు నిలిపి వేశారు. మొంథా తుపాను హెచ్చరికల నేపథ్యంలో కలెక్టర్ మహేష్ కుమార్ అమలాపురంలో నిర్వహి ంచిన సమీక్షలో సఖినేటిపల్లిరేవు ప్రయాణాన్ని తక్షణమే నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేశారని, దీంతో ఉదయం 10 గంటల తర్వాత పంటు ప్రయాణం నిలిచిపోయింది. ప్రస్తుతం వాతా వరణం ప్రయాణానికి సానుకూలంగా ఉన్నప్పటికీని, తుపాను హెచ్చరికల నేపథ్యంలో ప్రభుత్వం తీసుకుంటున్న భద్రతా చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకుం టున్నట్లు తెలిసింది. ముందస్తు సమాచారం లేకుండా పంటు ప్రయాణం నిలిచిపోవడంతో ఇరు జిల్లాల మధ్య ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

ఉచిత వైద్య శిబిరాలతో సత్వర వైద్యం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఉచిత వైద్య శిబిరాల ద్వారా పేదలకు సత్వర వైద్యం అందుతుందని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ మాధురిదేవి అన్నారు. ఆదివారం స్థానిక సాయి శంకర్ నేత్రాలయ ఆవరణలో లయన్స్ క్లబ్, కాకినాడ సూర్య కంటి ఆసుపత్రి, ఎఎల్ఐ పౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ శిబిరంలో సుమారు 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఆపరేషన్ అవసరమైన 38 మందిని కాకినాడ తరలించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ అనసూరి నాగేశ్వరరావు, సూర్య హాస్పిటల్ ఫౌండర్ డాక్టర్ రాంప్రకాష్, వైద్యులు రామసేష సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - యంత్రాంగం

మొంథా తుపాను పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రజాప్రతినిధులు,అధికారులు తెలిపారు. జిల్లాలో ఆయా ప్రాంతాల్లో వారు పర్యటించారు. అధికారులు సమావేశాలు నిర్వహించి తుపాను ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు.

సఖినేటిపల్లి: మొంథా తుఫాను కారణంగా తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అమలాపురం ఆర్‌డిఒ కొత్త మాధవి తెలిపారు. ఆదివారం సఖినేటిపల్లి మండలం లోని తీర ప్రాంత గ్రామాల్లో ఆమె పర్యటించారు. కేశవ దాసుపాలెం, పల్లిపాలెం గ్రామాలలో గల తుఫాను ఆశ్రమ భవనాలను స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. ఆమె వెంట సఖినేటిపల్లి మండల తహశీల్దార్ ఎం.సత్యనారాయణ, రాజోలు సిఐ టిఇ.నరేష్ కుమార్, ఎస్ఐ దుర్గా శ్రీనివాస్, స్థానిక సర్పంచ్ ఒడుగు శ్రీను, మాజీ సర్పంచ్ మూలస్వామి తదితరులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం:** తుపాను దూసుకు వస్తున్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు సూచించారు. ఆదివారం సాయంత్రం తీర గ్రామాలైన ఎన్.కొత్తపల్లి ఎస్.యానం,వాసాలతిప్ప గ్రామాలలో ఎంఎల్ఎ ఆనందరావు అధికారులతో కలిసి పర్యటించారు. ప్రజలకు జాగ్రత్తలు సూచించి అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఆయన వెంట తహశీల్దార్ వివిఎస్.దివాకర్, ఎంపిడిఒ డి.కృష్ణ, డిప్యూటీ తహశీల్దార్, జి.లలిత, డిప్యూటీ ఎంపిడిఒ ఎస్.రామకృష్ణ, సిఐ డి.ప్రశాంత్ కుమార్, ఎస్ఐ సిహెచ్.రాజేష్; టిడిపి మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, అముడా చైర్మన్ అల్లాడ సోంబాబు, రాష్ట్ర ఆక్వా డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ దేశం శెట్టి లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు. **మామిడికుదురు:** సముద్ర తీర ప్రాంతమైన కరవాక, గోగన మఠం, ముత్యాల పాలెం గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి వేణుగోపాల్, డిప్యూటీ ఎంపీడీవో అడబాల శ్రీనివాస్ లు సూచించారు ఆదివారం వారు తీర ప్రాంత గ్రామాలలో పర్యటించారు కరవాక మై రైన్ పోలీసులతో కలిసి అక్కడ తుఫాన్ షెల్టర్ పరిశీలించారు ప్రజల సురక్షిత ప్రాంతాలకుతరలి వెళ్లాలని సూచించారు పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించా లన్నారు. కరవాకరేవులో రాకపోకలు నిలిపివేశారు గోగన్నమఠంలో పంచాయతీ కార్యదర్శి పిఎస్‌వి.ప్రసాద్, సర్పంచ్ అల్లు విజయలక్ష్మి సురేష్ బాబులు, పాశర్లపూడి లంకలో సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, పంచాయతీ కార్యదర్శి డి.సురేష్ మైక్ ద్వారా తుపాను హెచ్చరికలు దండోరా వేయించారు. **కొత్తపేట:** తుపానుపై కొత్తపేట నియోజక వర్గంలోని అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు సూచించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తుపాను పరిస్థితులపై సమయానుసారం సమాచార మార్పిడి జరగడానికి కొత్తపేట రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు ఈ కంట్రోల్ రూం నంబర్లు 08855-244299, 8500238258 సంప్రదించవచ్చు. అలాగే విద్యుత్ శాఖ హెల్ప్‌లైన్‌లు అమలాపురం, రామచంద్రపురం కేంద్రాల్లో ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. తుపాను ప్రభావం వలన అక్టోబర్ 27,28,29 రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని, బలమైన గాలులు వీస్తాయని, 28, 29, తేదీలలో ఈ తుపాను తీరం దాటే అవకాశం ఉన్నందున ఆర్‌డిఒ పి.శ్రీకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు వాతావరణ శాఖ హెచ్చరికల దృష్ట్యా అత్యవసర పరిస్థితులలో తప్ప ప్రజలెవ్వరూ బయటకు రాకుండా ఇళ్లలోనే ఉండాలని, పైన చెప్పిన తేదీలలో దూర ప్రయాణాలు చేయరాదన్నారు. **మండపేట, కపిలేశ్వరపురం:** మొంథా తుపాను తీవ్రతను దృష్టిలో ఉంచుకొని అధికారులు అప్రమత్తంగా ఉండాలని మండపేట నియోజ కవర్గ ప్రత్యేక అధికారి విజయలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం లో ఆదివారం మొంథా తుపానుపై అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ నెల 26 నుండి 29 వరకు అధిక వర్షపాతం నమోదు అయ్యే అవకాశాలు ఉన్నాయని ఆమె తెలిపారు. తీవ్రమైన గాలులు తీవ్రమైన వీచే ప్రమాదం వుందన్నారు. గాలుల వల్ల ఇంటి పైకప్పులు ఎగిరే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించిన నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పంచాయతీ కార్యదర్శులు ఎటువంటి ప్రాణ, ఆస్తి, పశునష్టం జరగకుండా ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎప్పటి కప్పుడు గ్రామ రెవెన్యూ అధికారులతో అనుసంధానం చేసుకొని పనిచేయాలన్నారు. సచివాలఅ సిబ్బందికి సెలవులు రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. వారికి కేటాయి ంచిన విధులలో పనిచేయాల న్నారు. తుపాను ప్రభావంపై గ్రామాలలో దండోరా మైక్ ద్వారా ప్రచారం చేయాలని కోరారు. తాగునీరు ఇబ్బంది లేకుండా వాటర్ ట్యాంక్ నింపుకొని నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలని కోరారు. అవసరమైన సందర్భంలో జనరేటర్ ఏర్పాటు చేసుకోవాలని కోరారు. మండపేట మండల అభివృద్ధి అధికారి కె. సత్యనారాయణ మూర్తి, డిప్యూటీ ఎంపిడిఒ డి.శ్రీనివాస్, కపిలేశ్వరపురం ఎంపిడిఒ హెచ్.భానోజీ రావు, తహశీల్దార్ శ్రీనివాస్, రాయవరం ఎంపిడిఒ కె.కీర్తి స్పందన, తహశీల్దార్ బివి.భాస్కర్, డిప్యూటీ ఎంపిడిఒ పి.వెంకటరత్నం, మండపేట డిటి మెహర్ బాబా, కె.శ్రీనివాస్, ఎలక్ట్రికల్ ఎఇ కె.సుబ్రహ్మణ్యం, ఎఇ డ్రైన్స్ అధికారులు పాల్గొన్నారు **కపిలేశ్వరపురం**.వ మొంథా తుఫాను పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ జి.శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం, అన్ని శాఖల అధికారులందరిని తుఫాను పట్ల అప్రమత్తం చేసినట్లు తెలిపారు.

క్రీడాకారులకు సత్కారం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని కోరంగి పంచాయతీ పాతకోరంగి గ్రామానికి చెందిన రెజ్లింగ్ క్రీడాకారిణి అరుబరుకుల అర్చన, అథ్లెటిక్స్ క్రీడాకారుడు రొక్కం ఎర్రాబాబులను మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆదివారం ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా అర్చన తండ్రి రామచంద్రమూర్తి, ఎర్రాబాబు తండ్రి రొక్కం లోవరాజులను సంఘ నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పి మాజీ ఛైర్మన్ దున్న జనార్ధనరావు, పోలేకుర్రు సర్పంచ్ వెంటపల్లి నూకరాజు, వెంటపల్లి వెంకటరమణ, ఎండియూడబ్ల్యూఎ అధ్యక్ష, కార్యదర్శులు కన్నీడి వెంకటరమణ, కుసుమ శ్రీనివాస్, నాయకులు జక్కల ప్రసాద్‌బాబు, కమిడి ఈశ్వరి బాయి, పాలిక శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన

ప్రజాశక్తి - కాకినాడ

ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో 'ఈగల్' బృందం మాదక ద్రవ్యాల నియంత్రణ, న్యాయపరమైన శిక్షలపై అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా ఈగల్ బృందం ఇన్‌ఛార్జ్ ఎస్ఐ ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులు వ్యసనాలకు బానిస కాకూడదని, దేశ ప్రగతికి నాంది పలకాలని అన్నారు. సాధారణ చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థి యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. బృందం సభ్యుడు ధర్మతేజ మత్తు పదార్థాల కేసులు, శిక్షలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్ ఎఎస్ఐ నరసింహారావు మాట్లాడుతూ యువతే లక్ష్యంగా మత్తు పదార్థాల వాడకం జరుగుతుందని, విద్యార్థుల అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి టి.తేజేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ఎస్ఎస్, ఈగల్ టీమ్ విభాగాన్ని ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ ఎన్.సుగుణా రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు అభినందించారు.

ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వామ్యం అవసరం

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పార్టీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పిలుపునిచ్చారు. ఆదివారం ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో ఆయన టిడిపి శ్రేణులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సచివాలయ సిబ్బందితోపాటు, పార్టీ శ్రేనులు పాల్గొనాలని సూచించారు. ప్రభుత్వ పథకాల అమలులో టిడిపి శ్రేణులు కీలక పాత్ర పోషించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు, టిడిపి యువ నాయకుడు నిమ్మకాయల రంగనాగ్, ఎఎంసి ఛైర్మన్ నూనె మంగలక్ష్మి, ఎఎంసి డైరెక్టర్లు జలధాని సుబ్రహ్మణ్యం, రేలంగి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి దాతల విరాళాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో ప్రముఖ ఆలయాల్లో నిత్యాన్నదానానికి దాతలు ఆదివారం విరాళాలు అందజేశారు. దాతల స్వామి వార్ల చిత్రపటాలు అందజేశారు. వివరాలు ఇవి..

అయినవిల్లి : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అయినవిల్లి విఘ్నేశ్వరస్వామిని ఆదివారం రావులపాలెంకు చెందిన చొల్లంగి నవీన్‌వెంకటసాయి కుటుంబ సభ్యులు దర్శించికుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విఘ్నేశ్వర స్వామి నిత్యాన్నదాననిధికి రూ.10,116 విరాళంగా ఇచ్చినట్లు ఆలయ ఇఒ సతీష్ రాజు తెలిపారు. వీరికి ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందజేసి, శేష వస్త్రాలతో సత్కరించి, స్వామి వారి చిత్రపటాన్ని బహూకరించారు. బహుకరించారు. **ఆత్రేయపురం:** వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి వచ్చే యాత్రికులకు అన్నదానం నిర్వహించేందుకు గణపవరానికి చెందిన కొండేటి వెంకటరత్నం, వారి కుటుంబ సభ్యులు రూ.30,116, అలాగే రాజమహేంద్రవరానికి చెందిన భూపతిరాజు సాయి శరత్ వర్మ, వారి కుటుంబ సభ్యులు రూ. 36, 500 విరాళాలను ఆలయ డిసి నల్లం సూర్య చక్రధరావుకు అందజేశారు. వీరికి స్వామివారి దర్శనం అనంతరం తీర్థప్రసాదాలతో పాటు స్వామివారి చిత్రపటాలను అందజేశారు. **మామిడికుదురు:** కాకినాడకు చెందిన ధన్యంరాజు శేషగిరిరావు, వారి కుటుంబ సభ్యులు అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామిని ఆదివారం దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి శాశ్వత నిత్యాన్న ప్రసాద ట్రస్ట్‌కు రూ.10,116 విరాళంగా సమర్పించారని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు తెలిపారు . వీరికి ఆలయ అర్చకులు ఆశీర్వచనం,శ్రీ స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

వెంకన్న సన్నిధిలో సెంట్రల్ జైలు ఎస్‌పి

ఆత్రేయపురం: కోనసీమ తిరుమలగా పేరుగాంచిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామిని ఆదివారం రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్ ఎస్‌పి శ్రీరామ రాహుల్ సతీసమేతంగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ డిసి నల్లం సూర్యచక్రధర్‌రావు ఆలయ మర్యాదలతో స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలతో పాటు స్వామి వారి చిత్రపటం అందజేశారు.

నాగయ్య మృతి తీరని లోటు

ప్రజాశక్తి - అయినవిల్లి

రైతు కూలీ సంఘం నాయకుడు మచ్చా నాగయ్య మృతి తీరని లోటని పలువురు అన్నారు. నాగయ్య రెండు నెలల క్రితం మృతి చెందారు. ఆదివారం అయినవిల్లి లంకలోని ఆయన నివాసంలో నాగయ్య కుటుంబ సభ్యులను పలువురు నాయకులు పరామర్శించారు. అనంతరం నాగయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ జి.రాం దేవ్ (సాయిబాబా సోదరులు), కెయమ్ యమ్ఆర్.ప్రసాద్ (జనవిజ్ఞాన వేదిక కాకినాడ జిల్లాఅధ్యక్షులు), సామాజిక సేవకులు గంగుమళ్ళ శ్రీనివాస్, గిడ్ల వెంకటేశ్వరరావు, సర్పంచ్ కుమ్మరి మాధవిలత రమణ, గుమ్మడి అబ్బులు ఉన్నారు.



నాగయ్య చిత్రపటం వద్ద పలువురి నివాళి